

'జనస్పందన'తో ఇంటి వద్దే సమస్యల పరిష్కారం: ఎమ్మెల్యే

చేళూరు, ఆగస్టు 3: గ్రామీణ ప్రాంత ప్రజలు తమ పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఇంటి ముంగిటే పరిష్కరించేలా జనస్పందన కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు బాగేపల్లి ఎమ్మెల్యే సుబ్బారెడ్డి తెలిపారు. చేళూరు తాలూకా పాలకేరి గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన జనస్పందనలో ఆయన పాల్గొని ప్రజల సమస్యలు ఆలకించారు. పాలకేరి నుం చి చేళూరుకు రోడ్డు ఏర్పాటుకు రూ.5కోట్లు మంజూరు చేసినట్టు తెలిపారు. రైతులకు సాగు గుర్తింపుకార్డులు అందచేశారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సిద్ధూ తప్పుకోవాల్సిందే..



పాదయాత్రకు హాజరైన జనం



చలో మైసూరు పాదయాత్రలో పాల్గొన్న బీజేపీ, జేడీఎస్ నాయకులు



పాదయాత్రలో ముందుకు సాగుతున్న నాయకులు

- 'చలో మైసూరు' పాదయాత్రలో యడియూరప్ప
- కాంగ్రెస్ గద్దె దిగేదాకా పోరాడుతాం : విజయేంద్ర
- సీఎంను తొలగించేందుకే పాదయాత్ర : కుమారస్వామి
- రాహుల్ సూచన మేరకే అవినీతి : రాధామోహన్‌దాస్ అగర్వాల్
- పాదయాత్రతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం



ఢంకా మోగించి పాదయాత్రకు శ్రీకారం చుట్టిన నేతలు

బెంగళూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ముడా అవినీతిలో ఇరుక్కున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య తన పదవికి గౌరవంగా రాజీనామా చేయాలని బీజేపీ అగ్రనేత యడియూరప్ప డిమాండ్ చేశారు. చలో మైసూరు పాదయాత్ర శనివారం కెంగేరిలో ప్రారంభించారు. కేంద్రమంత్రి కుమారస్వామి, బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ రాధామోహన్‌దాస్, రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర సహా ముఖ్యనేతలందరూ పాల్గొన్నారు. ఢంకా మోగించి పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. అనంతరం యడియూరప్ప మాట్లాడుతూ అవినీతిలో చిక్కుకున్న సిద్దరామయ్య గౌరవంగా రాజీనామా చేయాలన్నారు. పాదయాత్ర వారం రోజులు సాగుతుందని, ఈలోగానే సిద్దరామయ్య రాజీనామా చేస్తారని జోస్యం చెప్పారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర మాట్లాడుతూ అవినీతి కాంగ్రెస్ ప్రభుత్వం గద్దె దికా పోరాటం సాగిస్తామని తెలిపారు. అధికారంలోకి వచ్చిన 14 నెలల్లోనే అన్ని వ్యవస్థలు దారి తప్పాయన్నారు. అహింద సామాజికవర్గాలకు న్యాయం చేస్తానని, ఎస్టీ కార్పొరేషన్‌కు అనుబంధమైన వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో రూ.187 కోట్లు లూటీ చేశారని ఆరోపించారు. ముడా ఇళ్ల పంపిణీలో రూ.5వేల కోట్ల అవినీతి జరిగిందన్నారు. గాంధీ కుటుంబానికి కానుకలు ఇచ్చేందుకు ఏటీఎం తరహాలో ప్రభుత్వం ఏర్పడిందని ఎన్నికల ముందే చెప్పామని, ప్రస్తుతం అదే జరుగుతోందని అన్నారు. ముడా అధ్యక్షుడు మరిగౌడను నియమించింది ముఖ్యమంత్రి కాదా..? అని ప్రశ్నించారు. పీకల్లోతు అవినీతిలో కూరుకుపోయిన కాంగ్రెస్, తమ పార్టీపై ఆరోపణలు చేస్తోందని, వారి బెదిరింపు ప్రకటనలకు ఎవరూ భయపడేవారు లేరన్నారు. కేంద్రమంత్రి, జేడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి మాట్లాడుతూ కాంగ్రెస్ పాపాలు పెరిగిపోతున్నాయని, వారు పదేళ్లు కాదు మరో పది నెలలు కూడా పాలన సాగించలేరని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా అవినీతికి పాల్పడుతోందన్నారు. సిద్దరామయ్యను తొలగించేందుకే పాదయాత్ర చేస్తున్నామని అన్నారు. పాదయాత్రను అడ్డుకునేందుకు బిడదిలో సభ జరిపారని, తమ ఆస్తుల గురించి బిడదిలోనే వివరిస్తానని అన్నారు. ఆయన అక్రమాలు చెబుతానని డీకే శివకుమార్‌కు సవాల్ విసిరారు. రాజకీయాల్లోకి వచ్చినప్పుడు ఆయన ఆస్తులు, ఇప్పుడు ఆయన ఎలా శ్రీమంతుడు అయ్యాడో అందరికీ తెలుసు అన్నారు. బ్లాక్ అండ్ వైట్ టీవీ, డీవీడీల గురించి ఆయన గురువే చెప్పారని తెలిపారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ రాధామోహన్‌దాస్ అగర్వాల్ మాట్లాడుతూ రాహుల్‌గాంధీ సూచన మేరకే అవినీతి జరిగిందన్నారు. సీఎంకు నోటీసు ఇచ్చినందుకు గవర్నర్‌కు ధన్యవాదాలు అన్నారు. పార్టీ అదనపు ఇన్‌చార్జ్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఇది ప్రజల సొమ్ము లూటీ చేసిన ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగుతున్న పాదయాత్ర అన్నారు. కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి మాట్లాడుతూ కాంగ్రెస్ డీఎన్‌ఏలోనే అవినీతి ఉందన్నారు. గతంలో వాజపేయి, ప్రస్తుతం నరేంద్రమోదీ ప్రభుత్వంలో ఎక్కడైనా అవినీతి వెలుగులోకి వచ్చిందా..? అని ప్రశ్నించారు. 2జీ సహా అనేకమైన అక్రమాలు కాంగ్రెస్ హయాంలోనే జరిగాయన్నారు. ఒక దళితుడి భూమిని మింగి సిద్దరామయ్య తప్పు చేశారని, ఆయన గవర్నర్‌ను ప్రశ్నించడమేమిటని అన్నారు. ప్రతిపక్షనేత అశోక్, చలవాది నారాయణస్వామి, కేంద్రమంత్రులు శోభాకరంద్లాజె, సోమణ్ణ, మాజీ సీఎంలు బసవరాజ్, బొమ్మై, సదానందగౌడ, మాజీ మంత్రులు అశ్వత్థనారాయణ, గోవింద కారజోళ, జేడీఎస్ యువ విభాగం అధ్యక్షుడు నిఖిల్, సురేశ్‌తోపాటు ఇరుపార్టీల ముఖ్యనేతలు పాల్గొన్నారు.



పాదయాత్రలో ఎమ్మెల్యే గాలి జనార్దనరెడ్డి, మాజీమంత్రి శ్రీరాములు



బూరను ఊదుతున్న విజయేంద్ర, నిఖిల్



నిలిచిపోయిన వాహనాలు

పాదయాత్రతో ట్రాఫిక్‌కు అంతరాయం

కెంగేరి నుంచి పాదయాత్ర ప్రారంభం కాగా మైసూరు రోడ్డు ట్రాఫిక్‌తో నిండిపోయింది. కిలోమీటర్ల కొద్దీ వాహనాలు ఆగిపోయాయి. మైసూరు నుంచి వచ్చే వాహనాలు గంటల తరబడి నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. కెంగేరిలో ప్రారంభమైన పాదయాత్ర మాగడి నియోజకవర్గ పరిధిలోని బిడది మంజునాథ కన్వెన్షన్ హాల్ దాకా సాగింది. కాగా పాదయాత్రకు ముందు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, జేడీఎస్ యువనేత నిఖిల్ కుటుంబ సమేతంగా చామండేశ్వరిదేవిని దర్శించుకున్నారు.

ఖర్చు తగ్గించేందుకు గుట్ట తవ్వుతారా..?

అధికారులపై ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆగ్రహం

బెంగళూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఖర్చు తగ్గించేందుకు అడ్డుగోడ నిర్మించకుండా 90 డిగ్రీల స్థాయిలో గుట్ట తవ్వకంతోనే కొండచరియలు విరిగిపడ్డాయని జాతీయ రహదారుల ఇంజనీర్లపై ముఖ్యమంత్రి సిద్దరామయ్య మండిపడ్డారు. శిరాడి ఘాట్‌లో కొండచరియలు విరిగిపడిన ప్రాంతాన్ని శనివారం ఆయన సందర్శించారు. గుట్టల తవ్వకంతోనే కూలుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్తరకన్నడ జిల్లా శిరూరు ప్రాంతంలో ఇదే జరిగిందన్నారు. చీఫ్ సెక్రటరీ శాలిని రజనీశ్ వివరిస్తూ 45 కిలోమీటర్ల నిర్మాణంలో 10 కిలోమీటర్లు మాత్రమే మిగిలిందన్నారు. అడ్డుగోడలు నిర్మించకపోవడం, సురక్షిత చర్యలు చేపట్టకపోవడమే ప్రమాదానికి కారణంగా ఉందన్నారు. అనంతరం సీఎం అధికారులతో సమీక్ష నిర్వహించారు. రోడ్డు నిర్మాణంలో ప్రమాదంపై కేంద్రమంత్రి నితిన్ గడ్కరికి లేఖ రాయాలని అధికారులను ఆదేశించారు. మైసూరు నుంచి శిరాడిఘాట్ దాకా 200 కిలో మీటర్ల మేర ప్రయాణించిన సీఎం మార్గమధ్యంలోనే అధికారులతో వివరాలు ఆరా తీశారు. రోడ్డుపక్కన ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాలను తొలగించాలని సూచించారు. మైసూరుతోపాటు మార్గమధ్యంలో పలువురు భేటీ అయ్యేందుకు వచ్చిన సమయంలో సీఎంకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు శాలువాలు, బొకేలు తీసుకురాగా తాను వేడుకలు చేసుకోనని, ఇటువంటి తనకు ఎందుకని సున్నితంగా తిరస్కరించారు.



శిరాడిఘాట్ ప్రాంతంలో పర్యటిస్తున్న సీఎం సిద్దరామయ్య తదితరులు

అవినీతికి కేరాఫ్ బీజేపీ

పాదయాత్ర చేసే నైతికత ఉందా...?
కుమారస్వామీ.. మాటెందుకు మార్చావు..?
రామనగర జనాందోళన సభలో డీకే శివకుమార్



రామనగరలో డీసీఎం డీకే శివకుమార్‌తో మంత్రులు తదితరులు

బెంగళూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): అవినీతికి కేరాఫ్ బీజేపీ అని ఉపముఖ్యమంత్రి, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ మండిపడ్డారు. బీజేపీ, జేడీఎస్ చేపట్టిన పాదయాత్రకు వ్యతిరేకంగా రామనగరలో శనివారం జనాందోళన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి డీకే శివకుమార్ మాట్లాడుతూ బీజేపీ పాదయాత్రకు ఒక్కరోజు ముందే బిడదిలో కావాలనే సభ జరిపానని తెలిపారు. పాదయాత్ర చేసే నైతికత బీజేపీ, జేడీఎస్ నేతలకు ఉందా అని ప్రశ్నించారు. తనను జైలుకు పంపుతానని, మిలిటరీ తీసుకొస్తానని కుమారస్వామి కేంద్ర మంత్రి అనే ధీమాలో చెప్పారని, తాను తీహార్ జైలుకు వెళ్లి వచ్చానని అన్నారు. 'మిస్టర్ కుమారస్వామి.. నేను తీహార్ చూసొచ్చాను, నా కుటుంబంపై వేసిన కేసులు చూశాను అన్నీ ముగిశాకనే నా నాయకత్వానికి రాష్ట్ర ప్రజలు 135 సీట్లు ఇచ్చారు.. నీకు వచ్చింది కేవలం 19 సీట్లే' అన్నారు. పెన్‌డ్రైవ్ తాను విడుదల చేశానని కుమారస్వామి తప్పుడు ప్రచారం చేశారని తెలిపారు. తాను రాజకీయాలు చేస్తానని, నీచమైన పనులు చేయనని అన్నారు. పెన్‌డ్రైవ్ పంచిన ప్రీతమ్‌గౌడతో కలసి వేదిక పంచుకోవాలా... అని మండిపడిన కుమారస్వామి ఇప్పుడు ఎలా మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. పెన్‌డ్రైవ్ బయటకు రాగానే తనకు, ప్రజ్వల్‌కు సంబంధం లేదని, రేవణ్ణ కుటుంబం వేరు, తన కుటుంబం వేరు అని, ఇప్పుడు మాత్రం ఎందుకు రాజకీయం చేస్తున్నావని ప్రశ్నించారు. యడియూరప్ప కంటతడితో ఎందుకు రాజీనామా చేశారు, జైలుకెందుకు వెళ్లారో విజయేంద్ర తెలుసుకోవాలన్నారు. యడియూరప్ప జైలుకు వెళ్లేందుకు జేడీఎస్ ఎలా కారణమైందో వివరణ ఇవ్వాలన్నారు. సిద్దరామయ్య భార్యకు ముడా ఇంటిస్థలం ఇచ్చింది ఏ ప్రభుత్వంలో అనేది తెలుసుకోవాలన్నారు. సిద్దరామయ్య కుటుంబం ఏమైనా భూ ఆక్రమణకు పాల్పడిందా..? అక్రమంగా భూములు రాయించుకున్నారా..? అని ప్రశ్నించారు. బసవరాజ్ బొమ్మై సీఎంగా ఉన్నప్పుడు ఇంటి స్థలం కేటాయించారన్నారు. తన ప్రశ్నలకు కుమారస్వామి సమాధానం కోసం వేచి చూస్తున్నా అన్నారు. అద్దాల మేడలో ఉంటూ రాళ్లు విసరడం సరికాదన్నారు. మీ పార్టీనేత బసనగౌడ పాటిల్‌యత్నాళ్ వ్యాఖ్యలకు సమాధానం చెప్పాలన్నారు. 2028లోనూ మేమే గెలుస్తామని సవాల్ విసిరారు. కార్యక్రమంలో మంత్రులు రామలింగారెడ్డి, చలువరాయస్వామి, ఎంబీ పాటిల్, శరణప్రకాశ్ పాటిల్, కేహెచ్ మునియప్ప, జమీర్ అహ్మద్‌ఖాన్, భైరతి సురేశ్, రహీంఖాన్, ఎంసీ సుధాకర్, రాజ్యసభ సభ్యుడు చంద్రశేఖర్, వినయ్‌కుమార్ సొరకె, హెచ్‌ఎం రేవణ్ణ, ఎమ్మెల్యేలు ఆనేకల్ శివణ్ణ, మాగడి బాలకృష్ణ, ప్రదీప్ ఈశ్వర్, రిజ్వాన్ అర్షద్, మాజీ ఎంపీ డీకే సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతిపై మానవదాడి

- పశ్చిమ కనుమలలో వేలాదిగా అక్రమ హోంస్టేలు
- పచ్చదనం, కొండకోనలపై నిరంతర దౌర్జన్యం
- నిబంధనల ఉల్లంఘనలపై పట్టించుకోని అధికారులు


బెంగళూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రం వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడి ఊళ్లకు ఊళ్లే గల్లంతయ్యాయి. వందలాదిమంది మట్టిలో కలసిపోయారు. ఈ ఘటనతో దేశమంతా ఉలిక్కిపడింది. పశ్చిమకనుమలు కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో సువిశాలంగా వెలసి ఉన్నాయి. ప్రకృతిని ఆస్వాదించాలనే స్వార్థంతో పచ్చదనం, కొండకోనలపై నిరంతర దౌర్జన్యాలు కొనసాగుతున్నాయి. అటవీ ప్రాంతాల్లో హోంస్టేలు, రిసార్టులు ఏర్పాటు చేశారు. అడవిలో రిసార్టులు, హోంస్టేలు ఏర్పాటు చేసేందుకు కొండలను తవ్వడం, సుదూరం పాటు రోడ్డు ఏర్పాటు చేసుకోవడం, మరిన్ని సౌలభ్యాలు పెంచుకోవాలని అరాచకంగా వ్యవహరిస్తున్నారు. ఇలా పశ్చిమకనుమలపై నిరంతరం మనుషుల దౌర్జన్యం వెంటాడింది. ఈ పర్యవసానమే వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడేందుకు కారణమైనట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇక రాష్ట్రంలోనూ పదివేలకుపైగా హోంస్టేలు ఉన్నట్లు తెలుస్తోంది. వీటిలో అనుమతులు కల్గినవి నాలుగువేలు మాత్రమే ఉండగా దానికి రెండింతలకుపైగానే అనధికార హోంస్టేలు ఉన్నాయి. పంటలనష్టం, కాఫీకి దిగుబడి తగ్గడం, ధరలు పడిపోవడం, వీటితోపాటు కూలీలు లభించే పరిస్థితి గగనమవుతుండడంతో అదనపు ఆదాయం పొందేందుకు హోంస్టేలు ఏర్పాటు చేసుకోవచ్చునని ఒకప్పుడు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. స్థానికుల ఉపాధికోసం వారే నిర్వహించాలని, నిర్ణీతంగా గదులు ఉండాలని ఆంక్షలు విధించింది. ఇలా ఒకప్పుడు కాఫీ తోటలకే పరిమితమైన హోం స్టేలు ప్రస్తుతం అడ్డూ అదుపులేకుండా పశ్చిమకనుమల వ్యాప్తంగా విస్తరించాయి. హోంస్టేల ముసుగులో పలుకుబడిగలవారు ఏకంగా రిసార్టులు ఏర్పాటు చేసుకున్నారు. అటవీభూముల్లోనూ హోంస్టేలు వెలిశాయి. అందమైన అటవీప్రాంతంలో వెలసిన హోంస్టేలు ఇక్కడి జలమూలాలు, చెట్లు, దట్టమైన అరణ్యాలు, జలచరాలు, వన్యప్రాణుల పాలిట శాపంగా మారాయి. వీటికితోడు పర్యావరణ ప్రాంతాల్లో నిర్మాణాల కోసం ఎక్స్‌కవేటర్ వంటి యంత్రాలు ఏర్పాటు చేసుకుని తవ్వకాలు జరిపారు. అనధికారిక హోంస్టేలు, రిసార్టులపై చర్యలు తీసుకోవాలని పర్యావరణ ప్రేమికులు పలు సందర్భాల్లో డిమాండ్ చేశారు. రాజకీయ పలుకుబడి, స్థానికంగా ఉండే పలు సంబంధాలతో ప్రభుత్వం విధించిన నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదు. అందుకే సూక్ష్మమైన అటవీ ప్రాంతాల్లోనూ హోంస్టేలు వెలుస్తున్నాయి. కొన్నిచోట్ల రాజకీయ పలుకుబడి కల్గిన వారు, అధికారుల బినామీల పేరిట హోంస్టేలు కొనసాగిస్తున్నారు. కాఫీతోటల నష్టాన్ని పూడ్చుకునేందుకు ఒక హోంస్టే ఏర్పాటు చేసుకునేందుకు వెసులుబాటు ఉన్నా ప్రస్తుత నాలుగైదు కొనసాగించేవారు ఉన్నారు. చిక్కమగళూరు, శివమొగ్గ, కొడగు, మైసూరు, చామరాజనగర, హాసన్, బెళగావి, దక్షిణకన్నడ జిల్లాల్లో రిజిస్ట్రేషన్ లేకుండానే హోంస్టేలు నడుపుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. జిల్లా అధికారి పర్యవేక్షణలో పర్యాటక అభివృద్ధి కమిటీ అనుమతులు తీసుకోవాలని ఎన్నిసార్లు హెచ్చరించినా పాటించేవారు లేకపోయారు. సాధారణంగా ఐదు గదులు ఉంటే హోంస్టేగా పరిగణించాలి. 15 - 20 గదులు ఉన్నా రిజిస్ట్రేషన్ లేకున్నా, జీఎస్టీ లేకున్నా అడిగేవారు కరువయ్యారు. వీటిలో కిట్టీ పార్టీలు, గెట్ టు గెదర్, కొన్నిశాఖల సభలు కూడా జరుపుతున్నారు. అనుమతులు లేని హోంస్టేలు ప్రస్తుతం పర్యాటకులకు ఆతిథ్యం ఇచ్చే ఇళ్లుగా ఉన్నాయి. వారాంతంలో విలాసకేంద్రాలు అయ్యాయి. స్థానిక భోజనానికి బదులుగా కేటరింగ్ పద్ధతి ప్రారంభమైంది. మందు, విందు పార్టీలు, పేకాట కేంద్రాలు మారిపోయాయి. ప్రభుత్వ ఆశయం కూకటివేళ్లతో పెకలించినట్టయ్యింది. పశ్చిమకనుమలలో తలెత్తుతున్న హోంస్టేలు, రిసార్టుల ప్రాంతాలకు నిత్యం జనసందడి, వాహనాలలో సంచారం ద్వారా ప్రకృతితో మమేకమై జీవిస్తున్న వన్యప్రాణులు, పక్షులు, అటవీ సంపద నాశనమయ్యేందుకు కారణమవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా 2.04 లక్షల ఎకరాలలో అటవీభూమి ఆక్రమణకు గురి కాగా 2,602 ఎకరాలను స్వాధీనం చేసుకున్నారు. బెంగళూరు నగరంలోనే 2,500 ఎకరాల అటవీభూమి ఆక్రమణకు గురైంది.

జిల్లా	హోంస్టేలు	అనుమతులు ఉన్నవి
కొడగు	3,500	2,000
చిక్కమగళూరు	3,000	602
హాసన్	2,000	210
ఉత్తరకన్నడ	300	233
ఇతర జిల్లాలు	2,000	800



అటవీభూముల ఆక్రమణల తొలగింపునకు ఆదేశం

పశ్చిమ కనుమలలో దశాబ్దాలకాలంగా ఆక్రమణలు కొనసాగుతున్నాయి. 2015 తర్వాత ఆక్రమణలకు గురైన అటవీ భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అనధికారిక హోంస్టేలు, రిసార్టులను తొలగించాలని అటవీశాఖ అధికారులను ఆదేశించింది. ఉత్తరకన్నడ జిల్లా అంకోలాలోని శిరూరులో భూమి కుంచించుకుపోవడం, శిరాడిఘాట్‌లో కొండచరియలు విరిగిపడ్డం వంటి ఘటనలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. రాష్ట్రంలోని పశ్చిమకనుమల్లో అనుమతులు లేకుండా వెలసిన రిసార్టులు, హోంస్టేలు, తోటలను స్వాధీనం చేసుకునేందుకు అటవీశాఖ సన్నద్ధమైంది. నెలరోజుల్లో నివేదిక సమర్పించాలని అటవీ శాఖ మంత్రి ఆదేశించారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1631.22	1,626.51
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	1,97,468	29,763
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	1,78,851	2099
సామర్థ్యం (టీఎంసీలు)	98.73	81.54

అంతర్గత రిజర్వేషన్లను అమలు చేయాలి



మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

బళ్లారి సిటీ, ఆగస్టు 3: షెడ్యూల్డ్ కులాల్లో అంతర్గత రిజర్వేషన్ల కోసం గత 30ఏళ్ళుగా జరిగిన పోరాటాల ఫలితంగా సుప్రీంకోర్టు ఈనెల 1న కీలక తీర్పునిచ్చిందని, వీలైనంత త్వరగా రాష్ట్ర ప్రభుత్వం వీటిని అమలు చేయాలని దళిత సంఘాల నేతలు డిమాండ్ చేశారు. నగరంలోని వార్తా భవనంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈశ్వరప్ప, దురుగప్ప తల్వార్ మాట్లాడుతూ తీర్పు వెలువరించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు కర్ణాటక రాష్ట్ర మాదిగ జాతీయ సంఘాల దళిత సంఘాల కార్యకర్తల తరఫున అభినందనలు తెలిపారు. షెడ్యూల్డ్ కుల ధృవీకరణ పత్రంలో మాదిగ ఉపకులాన్ని పేర్కొనేలా జిల్లా యంత్రాంగాలను ఆదేశించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేస్తామన్నారు. రిజర్వేషన్ల అమలును విస్మరిస్తే రాష్ట్రవ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వంపై ఉధృత పోరాటం చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో సంగనకల్లు నెట్టెప్ప, దానప్ప, హుసేనప్పతో పాటు పలువురు వెంకటేశ్‌మూర్తి, గాదిలింగప్ప, రమేశ్‌కుమార్,పృథ్వీరాజ్, వీరభద్రప్ప, శ్రీనివాస్,వీరస్వామి, బాబు, దురగేశ్,రుద్రప్ప, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

దళితుల నిధులు వారికే వినియోగించాలి



తహసీల్దార్‌కు మనవి పత్రం ఇస్తున్న దళిత నేతలు

సిరుగుప్ప, ఆగస్టు 3 : దళితులకు కేటాయించిన నిధులను ప్రభుత్వం సక్రమంగా వారికే వినియోగించాలని దళిత సంఘం నాయకులు వీరేష్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం సిరుగుప్ప పట్టణంలో దళిత సంఘర్ష సమితి ఆధ్వర్యంలో వివిధ డిమాండ్లపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ విశ్వనాథ్‌కు మనవిపత్రం అందజేశారు. ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన నిధులను ఇతర పనులకు వినియోగించడం తగదన్నారు. ఆ నిధులను దళితులకు ఉపయోగించాలని కోరారు. అత్యధిక మార్కులు సాధించిన దళిత విద్యార్థులకు నగదు బహుమతి అందజేసే పద్ధతిని అమలుచేయాలన్నారు. 16 అంశాల విషయాలను తహసీల్దార్‌కు తెలిపారు. తహసీల్దార్ విశ్వనాథ్ మాట్లాడుతూ, ప్రభుత్వానికి ఈవిషయాన్ని తెలియజేస్తామన్నారు. ఈకార్యక్రమంలో దళిత సంఘం నాయకులు నాగేశ్వరరావు, ఎం వీరేష, కార్యకర్తలు, పదాధికారులు పాల్గొన్నారు.

కలుషిత నీటిపై అధికారుల నిర్లక్ష్యం



కలుషిత నీటిని చూపుతున్న మాజీ ఎమ్మెల్యే

సిరుగుప్ప, ఆగస్టు 3 : టెక్కలకోట పట్టణ తాగునీటి చెరువులో నీరు కలుషితమైనా నగరసభ అధికారులు నిర్లక్ష్య ధోరణి వహిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప మండిపడ్డారు. శుక్రవారం సిరుగుప్ప పట్టణ అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనలో అవినీతి విలయతాండవం చేస్తున్నదని ఆయన ఎద్దేవా చేశారు. ఇసుక, ఎర్రమట్టి రవాణా అక్రమంగా కొనసాగుతున్నాయని ఆయన ఆరోపించారు. సిరుగుప్ప పట్టణంలో డెంగ్యూ వ్యాధులు పెరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆయన దుయ్యబట్టారు. టెక్కలకోట పట్టణంలో పశువైద్యశాల, ఇందిరా క్యాంటీన్ ఏర్పాటు చేయ కుండా ఉండడం సమంజసం కాదన్నారు. ఆర్టీసీ బస్టాండు వద్ద ఖాళీ స్థలంలో ఇందిరా క్యాంటీన్ ఏర్పాటు చేయాలని కోరారు. కెంచనగుడ్డ, ఎరకల్లు, ప్రాంతాలలో 300 ఎకరాలకు పైగా పంట పొలాల్లోకి నీరు వెళ్లడంతో నష్టం వాటిల్లిందని తెలిపారు. తక్షణమే ఆ రైతులకు నష్టపరిహారం కల్పించాలని కోరారు. తాలుకాలో అక్రమంగా సబ్సిడీ బియ్యం దందా జరుగుతోందని, ఈఅవినీతిపై పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చ అధ్యక్షులు మైఖేల్ వీరేష, రైతు నాయకులు ఎంఆర్ గౌడ, ఈరణ్ణ గౌడ, కౌన్సిలర్ మహదేవ, సీనియర్ పాల్గొన్నారు.

32 కిలోమీటర్లు గంగావతి, కంప్లిల మధ్య దూరం పెరిగింది

- పదిరోజులైనా తగ్గని వరద
- ఇబ్బందుల్లో ప్రజలు, విద్యార్థులు



కంప్లి కోట వంతెన మీదుగా ప్రవహిస్తున్న తుంగభద్ర నీరు

కంప్లి, ఆగస్టు 3 : ప్రస్తుత అధునాతన కాలంలో ప్రాంతాల మధ్య రోజురోజుకూ దూరం తగ్గుతోందేగాని పెరగడంలేదు. కాని విచిత్రంగా కంప్లి, గంగావతిల మధ్య దూరం మాత్రం 32 కి.మీ పెరిగిందంటే ఆశ్చర్యపడాల్సిందే. టీబీ డ్యాంకు వరద ప్రారంభమై పది రోజులకు పైగా అవుతున్నా ఇప్పటివరకు ప్రమాదకరస్థాయిలోనే నదీప్రవాహం పరుగులు తీస్తోంది. హంపి వద్ద మండపాలు, కంప్లి వద్ద దేవస్థానాలు నీటిలోనే నానుతున్నాయి. అలాగే కంప్లి, గంగావతిల మధ్య వంతెనపై నుంచి కూడా తుంగభద్రమ్మ పరుగులు ఆగలేదు. ఇలావంతెనపైన నీరు రోజుల తరబడి ప్రవహిస్తుండటంతో కంప్లి, గంగావతి మధ్య రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి విద్యార్థులు, రైతన్నలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మామూలుగా గంగావతి నుంచి చిక్కజంతిగల్ మీదుగా కంప్లికి వచ్చేందుకు ఒక కిలోమీటర్ దూరం మాత్రమే ప్రయాణించాల్సి ఉండేది. కాని వంతెన నీటమునగడంతో కంప్లికి వచ్చేందుకు 32 కిలోమీటర్ల దూరం చుట్టుతిరిగి ప్రయాణించాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్ష క్యూసెక్కుల నీరు నదికి రాగానే వంతెన మునిగిపోతోంది. గతంలో ఈ వంతెన పల్లపు ప్రాంతంలో నిర్మించడంతో బళ్లారి, కొప్పళ ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. ఇప్పుడున్న ప్రభుత్వమైనా హైలెవల్ వంతెన ఏర్పాటుచేసి రెండు జిల్లాల వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పిల్లలలో నాటకాలపై ఆసక్తిని పెంచాలి

- రాఘవ జయంతి ఉత్సవాల్లో జస్టిస్ మంజుల

బళ్లారి సిటీ, ఆగస్టు 3: కళారంగంలో పురుషులతోపాటు మహిళ పాత్ర కూడా చాలా కీలకంగా మారిందని రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చెల్లూరు మంజుల అభిప్రాయపడ్డారు.. కళలు, కథల పట్ల పిల్లలకు ఆసక్తిని పెంచి వారిని మంచి కళాకారులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. బళ్లారి రాఘవ కళామందిరంలో 144వ రాఘవ జయంతి ఉత్సవాలు రెండోరోజు అత్యంత ఘనంగా జరిగాయి. ఈసభకు కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముందుగా జస్టిస్ మంజుల మాట్లాడుతూ రాఘవ కళా మందిరానికి తన తండ్రి 33ఏళ్ళు కార్యకర్తగా పనిచేశారని గుర్తుచేశారు. తల్లి దండ్రులు మహిళా కళాకారులను ప్రోత్సహించాలని కోరారు. బళ్లారి రాఘవ కళామందిరం పుట్టినిల్లులాంటిందని పేర్కొన్నారు. 150కు పైగా వివిధ పాత్రలువేసి గిన్నీస్ రికార్డుఎక్కిన కోనేటి సుబ్బరాజు మాట్లాడుతూ కళాకారులను ప్రోత్సహించి, వారిని ఆదుకున్నప్పుడే సమాజం ఆనందంగా ఉంటుందన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న చెల్లూరు మంజుల



కోనేటి సుబ్బరాజును సన్మానిస్తున్న దృశ్యం

కళాకారులకు ఆస్తిపాస్తులకన్న వేదికపై కళాపోషణ చేయడమే ఆనందమని పేర్కొన్నారు. రాఘవ కళామందిరంలో ఇలాంటి గొప్ప కార్యక్రమాలుజరగడం హర్షణీయమని పేర్కొన్నారు. ఈసందర్భంగా గౌరవాధ్యక్షులు చన్నప్ప, రామాంజినేయులు, రమేశ్ గౌడపాటిల్, దనుంజయ, బసవరాజు, శ్రీనివాస్, సుందర్ రావు, ప్రకాశ్, శ్రీనివాస్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సంధ్యకోలాచలం,రమణప్ప భజంత్రి తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా చెల్లూరు మంజుళ కోనేటి సుబ్బరాజును సన్మానించారు. ఎన్నోపాత్రల్లో పోషించిన ఘనత ఆయనకు చెందుతుందన్నారు. కోనేటి సుబ్బరాజు మాట్లాడుతూ బళ్లారి రాఘవ కళామందిరంలో సన్మానం అందుకోవడం తనకు ఆనందదాయకమన్నారు.

ఆకట్టుకున్న మరణ మృదంగం నాటిక

బళ్లారి సిటీ, ఆగస్టు 3: కళా ప్రపూర్ణ బళ్లారి రాఘవ 144వ జయంతి సందర్భంగా శుక్రవారం ప్రదర్శించిన మరణమృదంగం నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. రాఘవ అవార్డు గ్రహీత రాజేంద్ర కారంత డైరెక్షన్‌లో ఈ నాటికను



మరణ మృదంగం నాటికలో ఓ సన్నివేశం

ప్రదర్శించారు. ఈనాటికను చివరి వరకు చాలామంది న్యాయనిర్ణేతలు కూర్చుని ఆస్వాదించడం విశేషం. రాజేంద్ర కారంత మాట్లాడుతూ, ఈ నాటకం రాజకీయ జీవితంలోని మార్పులను, జీవితంలోని బాధలను ప్రతిబింబిస్తుందని అన్నారు. బహుభాషల్లో నటించిన రాఘవకు దేశ, విదేశాల్లో అవార్డులు రావడం మరువలేని విషయమన్నారు. నాటకాన్ని చూసేందుకు వచ్చే ప్రేక్షకులు ఉన్నా, ప్రస్తుతం థియేటర్ల కొరత ఉందన్నారు. నాటకాన్ని నేర్చుకునేందుకు వెళితే పిల్లలు చెడిపోతారనే భావన తల్లిదండ్రుల్లో తొలగిపోవాలన్నారు. ఈ దిశగా ప్రభుత్వం ఆలోచించాలని, ప్రాథమిక విద్యా స్థాయి నుంచే నాటకాలు నేర్పించాలని, తద్వారా వారిలో తార్కిక శక్తి పెరుగుతుందన్నారు. అధ్యక్షత వహించిన రాఘవ మెమోరియల్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు చన్నప్ప మాట్లాడుతూ 2008నుంచి కన్నడ, తెలుగు రంగస్థల నాటకాల్లో సేవలందించిన వారికి రాఘవ మెమోరియల్ అసోసియేషన్ ప్రతి సంవత్సరం అవార్డులు అందజేస్తున్నదన్నారు. వారికి 21వేల నగదు, రాఘవ రజత పతకాన్ని, జ్ఞాపికను అందజేసి సత్కరిస్తున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పూర్వవిద్యార్థుల గురువందన

బళ్లారిరూరల్, ఆగస్టు 3 : బళ్లారి నగరంలో హోటల్ నక్షత్ర ఫంక్షన్ హాల్‌లో శనివారం గురువందన కార్యక్రమం, పూర్వవిద్యార్థుల స్నేహ సమ్మేళన కార్యక్రమం ఘనంగా జరిగాయి. చేళగుర్కి యర్రితాత సర్కారీ పాఠశాలలో 1993-2000 మధ్య ఎస్ఎస్ఎల్‌సీ చదివిన విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా జరుపుకున్నారు. బళ్లారి కనకదుర్గమ్మ దేవస్థానం ఆవరణ నుంచి ఉపాధ్యాయులను వెండి రథంలో మెరువాణి బాండ్ వాయిద్యాలతో నక్షత్ర వరకు తీసుకెళ్లారు. ఈ కార్యక్రమాన్ని బళ్లారి అసిస్టెంట్ కలెక్టర్ జుబేరా, అడిషనల్ ఎస్పీ రవికుమార్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఎన్నో సంవత్సరాల పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ ఇలాంటి పూర్వ విద్యార్థుల కలయిక ఎంతో సంతోషాన్నిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహారుద్రగౌడ ప్రభావతి, కృష్ణారెడ్డి, పంపనగౌడ్‌ల ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు మేటి శశిధర్, తిమ్మప్ప, జోళదరాసి, జనార్దన్ నాయక్, భీమప్ప, పీడీ



జ్యోతి వెలిగిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ జుబేరా తదితరులు

హళ్లి, రవికుమార్, పోలీసు బండేగౌడ, రాజశేఖర్, యర్రిస్వామి, వందలాది మంది పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేరాలను అదుపు చేస్తాం - ఎస్పీ



ఎస్పీ శోభారాణిని సన్మానిస్తున్న కౌన్సిలర్ కమల్ హుస్సేన్‌సాబ్

సిరుగుప్ప, ఆగస్టు 3 : నగరంలో చోరీలు జరుగకుండా వుండేందుకు క్రైమ్ బ్రాంచ్‌ను అలర్ట్ చేస్తామని జిల్లా ఎస్పీ శోభారాణి తెలిపారు. సిరుగుప్ప పట్టణాన్ని శనివారం ఎస్పీ సందర్శించారు. రూ. 5.40 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న పోలీసు క్వార్టర్స్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం కౌన్సిలర్ కమల్ హుస్సేన్‌సాబ్ ఆమెకు పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సిరుగుప్ప తాలుకాలో రాత్రివేళల్లో జరుగుతున్న ఇసుక, ఎర్రమట్టి, సబ్సిడీ బియ్యం దొంగతనాలపై క్రైమ్ బ్రాంచ్‌ను అలర్ట్ చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా పోలీసులకు ఫోన్ చేసి సమస్యలు పరిష్కరించుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ వెంకటేష్, సీఐ హనుమంతప్ప, పోలీసులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి బళ్లారి హాకీ జట్టు ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన హాకీ జట్టు

బళ్లారి సిటీ, ఆగస్టు 3: జిల్లా స్థాయి బళ్లారి ప్రభుత్వ ఉద్యోగుల హాకీ జట్టు రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైంది. ఈ జట్టుకు కెప్టెన్‌గా ఆరోగ్యశాఖ నుంచి షాషావలి, వైస్ కెప్టెన్‌గా విద్యాశాఖ నుంచి షేక్షావలి ఎంపికయ్యారని బళ్లారి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లాధ్యక్షుడు శివాజీరావు తెలిపారు. ఈ జట్టుకు ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, మేనేజర్ ఆసిఫ్, జిల్లాహాకీ కోచ్ జాకీర్ అహ్మద్, బళ్లారి హాకి సంఘం సంయుక్త కార్యదర్శి సయ్యద్ సైఫుల్లా, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

అలరించిన పారా మిలిటరీ బలగాలపై సదస్సు



సదస్సులో పాల్గొన్న ప్రభుత్వ ఆయుర్వేదిక్ కాలేజీ విద్యార్థులు

బళ్లారి సిటీ,ఆగస్టు 3: పారా మిలిటరీ బలగాలు దేశాన్ని ఎలా కాపాడుతాయి అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమం శనివారం నగరంలోని తారానాథ్ ఆయుర్వేదిక్ ఆసుపత్రిలో జరిగింది. ఈసందర్భంగా కళ్యాణ కర్ణాటక పారా మిలిటరీ సంఘం ప్రధాన కార్యదర్శి ప్రహ్లాదరెడ్డి మాట్లాడుతూ దేశం గురించి అనేక విషయాలను విద్యార్థులకు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ సిద్ధాంత క్రిష్ణనాయక్, మిలిటరీ సంఘం ఉపాధ్యక్షులు ఈశ్వరరెడ్డి, రాజసింహా, లక్ష్మణ, షేక్‌సాబు, గోవిందరాజు,వీరేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వేణి వీరాపురంలో రోగులకు చికిత్స చేస్తున్న వైద్యులు

కంప్లి, ఆగస్టు 3 : పట్టణాలలో, గ్రామాలలో ఏర్పాటు చేసే ఉచిత ఆరోగ్య శిబిరాలను సద్వినియోగ పరచుకోవాలని ఏసీసీ సిమెంట్ అదానీ కంపెనీ వ్యవస్థాపకులు షబ్బీర్ బాషా తెలిపారు. అదానీ కంపెనీ ఆధ్వర్యంలో శనివారం కుడితిని, సిద్దమ్మనహళ్లి, ఏఱబెంచి, వేణి వీరాపురం గ్రామాల్లో ఉచిత ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ మాట్లాడుతూ గ్రామాల్లో అనారోగ్యాలకు గురవుతున్న ప్రజలను దృష్టిలో వుంచుకుని ఉచిత ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, గ్రామ ప్రముఖులు, అదానీ కంపెనీ ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రజలకు అనుగుణంగానే ఆస్పత్రి ఏర్పాటు

కంప్లి, ఆగస్టు 3 : కంప్లి పట్టణంలో నూతనంగా ఆర్థోపెడిక్ ఆస్పత్రిని శనివారం ప్రారంభించారు. ఈ ఆస్పత్రిలో ప్రజలకు అనుగుణంగా డాక్టర్ విశ్వనాథ్ చికిత్స చేస్తారని ఎమ్మెల్యే జేఎన్ గణేష్ తెలిపారు. ఎంతో మంది యాక్సిడెంట్ అయిన సమయంలో, కాళ్లు, చేతులు విరిగిన సమయంలో సదుపాయాలు లేక



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న దృశ్యం

గంగావతి, హోస్పేట, బళ్లారి ప్రాంతాలకు చికిత్సలకు వెళ్లే వారన్నారు. వారిని దృష్టిలో వుంచుకుని డాక్టర్ విశ్వనాథ్ ఆర్థోపెడిక్ ఆస్పత్రిని ఏర్పాటు చేశారన్నారు. అనంతరం వైద్యులు ఎమ్మెల్యే జేఎన్ గణేష్‌కు అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కనకరాజు, బసవ, తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

లలితా దేవికి వైభవంగా సహస్రనామార్చన

హోసూరు ఆగస్టు 3: శ్రీ అర్ధనారీశ్వర ఆలయంలో ఆడి నెల ప్రారంభ సమయంలో తమిళులు లోక కల్యాణం కోసం లలిత సహస్రనామ పూజ నిర్వహించారు. హోసూరు సమీపంలోని తమ్మనాయకనపల్లి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీ అర్ధనారీశ్వర ఆలయంలో శనివారం ఘనంగా పూజలు నిర్వహించారు. తమిళనాడులో ఆడిమాసం 18 వ రోజును చాలా కోలాహలంగా జరుపుకుంటారు. గురుశక్తి రత్తినమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రత్యేక పూజల్లో మహిళలు అధిక సంఖ్యల్లో పాల్గొని దీపారాధన చేస్తూ పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి వివిధ పుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తులు జ్యోతులు వెలిగించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి గంగాపూజ నిర్వహించారు. ఆపై నాలుగు గరుడ పక్షులు ఆలయంపై ప్రదక్షిణ చేయడంతో భక్తులందరూ ఎంతో ఆశ్చర్యకరంగా వీక్షించారు.



సర్వాలంకారాలతో దర్శనమిచ్చిన అమ్మవారు

శ్రీలంక తమిళుల కోసం నిర్మించిన 52 ఇళ్ల ప్రారంభం

హోసూరు(కృష్ణగిరి) ఆగస్టు 3 : కృష్ణగిరి జిల్లా ఊత్తంగరై పంచాయతీ యూనియన్, తిమ్మాపట్టి పంచాయతీ కేతునాయకన్‌పట్టి గ్రామంలో శ్రీలంక తమిళుల శిబిరాల్లో శ్రీలంక తమిళులకు 52 గృహాలను మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి సెంజి కె.ఎస్.మస్తాన్ శనివారం ప్రారంభించారు. శ్రీలంక తమిళులకు సురక్షిత గృహాలను నిర్మించాలనే లక్ష్యంతో 3551 ఇళ్లను కేటాయించారు. వీటిలో పూర్తయిన ఇళ్లను మంత్రి శనివారం ప్రారంభించారు. జిల్లా పంచాయతీ నాయకురాలు మణిమేగలై నాగరాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మలర్విళి, జిల్లా వెనుకబడిన మైనారిటీ సంక్షేమ అధికారిణి పద్మలత, జిల్లా ట్రస్టీ కమిటీ చైర్మెన్ రజిని సెల్వం, రాష్ట్ర మహిళా కమీషన్ సభ్యురాలు మాలతీ, ఊత్తంగరై యూనియన్ నాయకురాలు ఉషాకుమారేషన్, స్థానిక అభివృద్ధి అధికారులు శ్రీ బాలాజీ, తవమణి, జిల్లా పంచాయతీ కమిటీ సభ్యుడు కదిరవన్, మూడవ పట్టి పంచాయతీ కౌన్సిల్ చైర్మెన్ భూబాలన్, వివిధ శాఖల అధికారులు స్థానిక ప్రభుత్వ ప్రతినిధులు పాల్గొన్నారు.

వినాయక విగ్రహ ప్రతిష్ఠలో నిబంధనలు పాటించాలి

హోసూరు ఆగస్టు 3 : హోసూరులో గణేశ విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు ప్రభుత్వ నిబంధనలను పాటించాలని డీఎస్పీ బాబుప్రశాంత్ విజ్ఞప్తిచేశారు. ఈ ఏడాది గణేశ చతుర్థి పండుగకు ముందు గణేశ విగ్రహ ప్రతిష్ఠాపనకు సంబంధించి డీఎస్పీ కార్యాలయంలో శనివారం సంప్రదింపుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డీఎస్పీ బాబుప్రశాంత్ అధ్యక్షత వహించారు. ఇన్‌స్పెక్టర్లు శివకుమార్, ముత్తమిళసెల్వన్‌లు నాయకత్వం వహించారు. ఇందులో వివిధ హిందూ సంస్థల నిర్వాహకులతోపాటు పలువురు పాల్గొన్నారు. గణేశుడి విగ్రహం 10 అడుగులకు మించకూడదని, గతేడాది విగహం పెట్టిన ప్రదేశాల్లోనే మరలా విగ్రహాన్ని ఉంచేందుకు అనుమతిస్తామన్నారు. ప్రభుత్వ అధీనంలో ఉన్నబహిరంగ ప్రదేశాల్లో విగ్రహాలు పెట్టకూడదన్నారు. విగ్రహాలను దాని యజమాని అనుమతితో ప్రైవేట్ ప్రదేశాలలో ఏర్పాటుచేయాలన్నారు. అలాగే సామాన్యులకు ఇబ్బంది కలిగించేలా పందిరి వేయకూడదని పేర్కొన్నారు. విగ్రహాల ప్రదేశాలలో రాత్రి పగలు భద్రత కోసం నిఘా కెమరా, ఐదుగురు ప్రతినిధులు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. పైకప్పు, చుట్టు భద్రతా ఏర్పాటు చేసుకోవాలని తగిన సమయంలో విగ్రహాలను తొలగించాలన్నారు. లౌడ్ స్పీకర్లను పెట్టకూడదని, ఇతర మతాల వారిని కించపరచకూడదన్నారు. వినాయక విగ్రహ ఊరేగింపు అనుమతి ఉన్న ప్రదేశాలగుండా మాత్రమే వెళ్లాలని, విగ్రహం పెట్టే నెపంతో ఎవరి దగ్గరా డబ్బులు వసూలు చేయ కూడదన్నారు. ప్రభుత్వ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని తెలిపారు.



వినాయక చతుర్థి సంప్రదింపుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

దర్వేష్ కంపెనీ చీఫ్ కోసం ముమ్మర గాలింపు

- హుబ్లీలో భార్య ఇంటిపై సీఐడీ అధికారుల దాడి

రాయచూరు, ఆగస్టు 3 : నగరంలో వందల కోట్ల రూపాయల ఆర్థిక నేరానికి పాల్పడిన దర్వేష్ కంపెనీ చీఫ్ మహ్మద్ హుసేన్ సుజాను అరెస్టు చేసేందుకు సీఐడీ అధికారులు ముమ్మర వేట ప్రారంభించారు. ఇప్పటి వరకు కంపెనీలో ప్రధాన సూత్రధారులుగా ఉన్న ఐదుగురిని అరెస్టు చేసిన సీఐడీ అధికారులు వారు ఇచ్చిన ఆధారంగా పలు చోట్ల గాలింపులు చేపట్టడంతో పాటు పుణె, ముంబై వంటి నగరాల్లోను సీఐడీ కీలక నిందితుడి కోసం వేట ప్రారంభించింది. ఈ క్రమంలో సోమవారం హుబ్లీలో మహ్మద్ హుసేన్ సుజా భార్య పుట్టింటి వద్ద సోదాలు నిర్వహించారు. నిందితుడు భార్య పుట్టింటిలో తల దాచుకుని ఉంటాడని అనుమానిస్తున్న సీఐడీ అధికారులు అక్కడ ఒక్కసారిగా దాడి చేసి పరిశోధన చేపట్టడంతో బంధువులంతా ఆశ్చర్యానికి గురయ్యారు. ఆగస్టు 7వ తేదీలోగా ఖాతాదారులందరికి 4 శాతం వడ్డీతో డిపాజిట్ సొమ్మును తిరిగి ఇస్తానని వీడియో ద్వారా నిందితుడు తెలపగా ఆ గడువు మరో మూడు రోజులే మిగిలి ఉండడంతో డిపాజిట్‌దారులు ఆశతో ఎదురు చూస్తున్నారు. ఇదిలా ఉండగా జిల్లా పరిధితో పాటు వివిధ చోట్ల పెద్ద ఎత్తున బ్రాంచ్‌లను ఏర్పాటు చేసుకుని వందల కోట్ల మేరకు డిపాజిట్ సొమ్మును సేకరించిన మహ్మద్ హుసేన్ సుజా విదేశాలకు పారిపోకుండా సీఐడీ అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. దేశం విడిచి నిందితుడు పారిపోలేడని ఎక్కడ ఉన్నా ఆయనను నిర్బంధించి తీరతామంటూ సీఐడీ అధికారులు ఖాతాదారులకు అభయం ఇస్తున్నారు.

ముదగల్‌లో పట్టపగలే దొంగల హల్‌చల్

- యజమానిపై దాడి చేసి ఆభరణాలు చోరీ




చోరీకి గురైన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

రాయచూరు, ఆగస్టు 3 : జిల్లాలోని లింగసుగూరు తాలూకా ముదగల్ పట్టణంలో శనివారం పట్టపగలే దొంగలు హల్‌చల్ సృష్టించారు. స్థానిక మేగళపేటలో నివాసం ఉంటున్న నింగప్ప ఇంట్లోకి చొరబడిన దుండగులు ఒంటరిగా ఉన్న నింగప్పపై అకస్మాత్తుగా దాడికి దిగారు. దీంతో దిగ్భ్రాంతికి గురైన అతడిని దొంగలు భయపెట్టి ఇంట్లోని బంగారు ఆభరణాలు, నగదు దోచుకెళ్లారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. విషయం తెలుసుకున్న దత్తాత్రేయ కర్నాడ్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాలచంద్ర సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

మాస్టర్ సీవీవీ (జయంతి)



మాస్టర్ కంచుపాటి వెంకటరావు వెంకటసామిరావు (సీవీవీ) 1868 ఆగస్టు 4న తమిళనాడు రాష్ట్రం కుంభకోణంలో జన్మించారు. తత్వవేత్త, యోగి, గురు. తొలుత కుంభకోణం మునిసిపల్ కౌన్సిల్ ఛైర్మన్‌గా వ్యవహరించి అనంతరం ఆధ్యాత్మికత వైపు మరలారు. 'భ్రుక్త రహిత తారక రాజయోగ' అనే సరికొత్త యోగాన్ని ప్రవేశపెట్టారు. దీన్ని ఎలక్ట్రానిక్ యోగాగా వ్యవహరించారు. ఆయన బోధించిన యోగాపై పలు పుస్తకాలు వెలువడ్డాయి. 1922 మే 12న కన్నుమూశారు.

జంధ్యాల పాపయ్యశాస్త్రి (జయంతి)



ఇరవయ్యో శతాబ్దంలో జనాదరణ పొందిన తెలుగు కవులలో ఒకరైన జంధ్యాల పాపయ్యశాస్త్రి 1922 ఆగస్టు 4న గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం కొమ్మూరు గ్రామంలో జన్మించారు. సులభమైన శైలిలో, సమకాలీన ధోరణిలో చక్కని తెలుగు నుడికారముతో కవిత్వము ఉండడం ఆయన రచనల ప్రత్యేకత. కరుణశ్రీగా పేరొందారు. పుష్పవిలాపము, కుంతికుమారి కావ్యాలు ప్రసిద్ధి చెందాయి. మనుషులలో ఉత్తమ మార్పుకు, సమాజంలో శాంతికై రచనలు చేశారు. గౌరవ డాక్టరేట్, కవితా కళానిధి తదితర గౌరవాలు అందుకున్నారు. 1992 జూన్ 21న పరమపదించారు.

నూకల చిన్న సత్యనారాయణ (జయంతి)



కర్ణాటక సంగీతంలో బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ నూకల చిన్న సత్యనారాయణ 1923 ఆగస్టు 4న విశాఖపట్నం ప్రాంతం అనకాపల్లిలో జన్మించారు. పలువురు ప్రముఖ గురువుల వద్ద శిష్యరికంతో గాత్రంలోనూ, వయోలిన్‌లోనూ రాణించారు. లండన్ మేయర్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాడారు. అమెరికా ఆహ్వానం మేరకు అక్కడ తన గళాన్ని వినిపించారు. పంచరత్న కీర్తనలను మోనోగ్రాఫ్ మీద వెలువరించారు. రాష్ట్రంలోని పలు సంగీత కళాశాలల్లో వివిధ స్థాయిల్లో పని చేశారు. కేంద్ర సంగీతనాటక పురస్కారాన్ని, మద్రాసు సంగీత పీఠంచే 'సంగీతాచార్యుడి'గా, ఆలిండియా రేడియోలో టాప్ ఆర్టిస్టుల్లో ఒకరైన ఈయన సంగీత కళా ఆచార్య, 'మహా మహోపాధ్యాయ', పద్మభూషణ్ తదితర గౌరవాలు అందుకున్నారు. 2013 జూలై 11న కన్నుమూశారు.

మండలి వెంకట కృష్ణారావు (జయంతి)



మండలి వెంకట కృష్ణారావు 1926 ఆగస్టు 4న కృష్ణా జిల్లా కైకలూరు మండలం పల్లెవాడ గ్రామంలో జన్మించారు. 1972లో అవనిగడ్డ నియోజకవర్గం నుంచి ఏకగ్రీవంగా ఎన్నికైన శాసనసభ్యుడు, గాంధేయవాది. సాంస్కృతిక కళలు, విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. గాంధీ మార్గంలో సాగేవారు. 1977 లో తుఫాను సంభవించినప్పుడు ఆయన అందించిన సేవలకు 'దివిసీమ గాంధీ'గా పేరొందారు. తెలుగు దాత, తెలుగు వెలుగు, సూత్రధారి తదితర బిరుదులు పొందారు. 1997 సెప్టెంబరు 27న కన్నుమూశారు. కాగా కుమారుడిలో ఒకరైన మండలి బుద్ధప్రసాద్ ఆంధ్ర ప్రదేశ్ డిప్యూటీ స్పీకర్‌గా కొనసాగి మంచిపేరు పొందారు.

కిషోర్‌కుమార్ (జయంతి)




దేశంలో ప్రముఖ నేపథ్య గాయకులలోఒకరైన కిషోర్ కుమార్ 1929 ఆగస్టు 4న మధ్య ప్రదేశ్ రాష్ట్రం ఖాండ్వాలో జన్మించారు. అసలు పేరు అభాస్ కుమార్ గంగూలి. హిందీ సినీ రంగంలో నటుడిగా, సంగీత దర్శకుడిగా, డైరెక్టర్‌గా రాణించారు. 'ట్రాజెడీ కింగ్'గా పేరొందారు. హిందీతో పాటు బెంగాలీ, మరాఠీ, అస్సామీ, గుజరాతీ, కన్నడ, బోజ్‌పురి, మలయాళం, ఉర్దూ భాషల చిత్రాలలో పాటలు పాడారు. అనేక ప్రైవేట్ ఆల్బమ్స్‌కు కూడా పాడారు. ఉత్తమ నేపథ్యగాయకుడిగా 8 ఫిలింఫేర్ పురస్కారాలు, ఇతర అవార్డులు అందుకున్నారు. 1987 అక్టోబరు 13న కన్నుమూశారు.

వేలూరు రామభద్రన్ (జయంతి)



'సంగీత కళానిధి' వేలూరు జీ రామభద్రన్ 1929 ఆగస్టు 4న సేలంలో జన్మించారు. మృదంగం మేస్త్రోగా రాణించారు. ఇతర కళాకారులతో కలసి సంగీత కచేరీలు ప్రదర్శించారు. హిందూస్తానీ సంగీతంలో సీనియర్, వర్ధమాన కళాకారుల తోనూ పని చేశారు. సంగీత చూడామణి, సంగీత నాటక అకాడమీ అవార్డు, సంగీత కళా శిఖామణి తదితర పురస్కారాలు అందుకున్నారు. 2012 ఫిబ్రవరి 27న కన్నుమూశారు.

బరాక్ ఒబామా (పుట్టినరోజు)



బరాక్ ఒబామా 1961 ఆగస్టు 4న హవాయిలో జన్మించారు. అమెరికా దేశ 44వ అధ్యక్షుడిగా 2009 నుంచి 2017వరకు కొనసాగారు. డెమొక్రటిక్ పార్టీలో కీలకంగా కొనసాగారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రజల మధ్య సత్సంబంధాలు కొనసాగించేలా కృషి చేసినందుకు '2009 నోబెల్ పీస్ ప్రైజ్' అందుకున్నారు. 'మోస్ట్ రెస్పెక్టెడ్ వరల్డ్ లీడర్'గా, మోస్ట్ పవర్‌ఫుల్ లీడర్‌గా చరిష్మా ఉంది. బెస్ట్ స్పోకెన్ వర్డ్ ఆల్బమ్ గ్రామీ అవార్డ్ అందుకున్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించండి

బుక్కరాయసముద్రం, ఆగస్టు 3: ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారించాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త విజయశంకర్‌బాబు సూచించారు. శనివారం రేకులకుంటలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రంలోని శాస్త్రవేత్తలు, రెడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ జేడీఏ ఉమామహేశ్వరమ్మ మెట్ట పంటలను పరిశీలించారు. అనంతరం సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షాభావపరిస్థితుల నేపథ్యంలో రైతులు సాగుచేయాల్సిన పంటలపై చర్చించారు. ఈ సందర్భంగా విజయ్‌శంకర్‌బాబు మాట్లాడుతూ ప్రస్తుతం ఉమ్మడి జిల్లాల్లో కంది, జొన్న, కొర్ర, సజ్జ, అలసంద, ఉలవ, ఆముం, పెసర పంటలను వేసుకోవచ్చన్నారు.

సీఎస్ఆర్ నిధులు విద్యకే కేటాయించాలి : డీసీఎం

» బీసీఐసీ నూతన అధ్యక్షుడిగా వినీత్‌వర్మ



బీసీఐసీ వార్షిక సమావేశంలో డీసీఎం డీకే శివకుమార్ తదితరులు

బెంగళూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సంస్థలు సీఎస్ఆర్ నిధులను విద్యా సౌలభ్యాలకు ఖర్చు చేయాలని తద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయని డీసీఎం డీకే శివకుమార్ అభిప్రాయపడ్డారు. బెంగళూరు చాంబర్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ కామర్స్ (బీసీఐసీ) 47వ వార్షిక సభలో కొత్త కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షులుగా వినీత్‌వర్మ ఎంపికయ్యారు. ఇదే సందర్భంగా సమాజానికి విభిన్న రంగాలలో సేవలందిస్తున్న వారిని సత్కరించారు. చాణక్య యూనివర్సిటీ చాన్స్‌లర్ పద్మశ్రీ ఎంకే శ్రీధర్, ఐఐఎం ప్రొఫెసర్ త్రిలోచనశాస్త్రి, ఎయిర్‌పోర్ట్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ భాస్కర్ ఆనందరావ్, రామ్‌లల్లా విగ్రహ శిల్పి అరుణ్‌యోగిరాజ్‌తోపాటు ఎస్‌కే శర్మలను అభినందించారు. ఈ సందర్భంగా డీకే శివకుమార్ మాట్లాడుతూ బెంగళూరు, కర్ణాటకవైపే ప్రపంచమే చూసే పరిస్థితి ఏర్పడిందన్నారు. అందుకు భిన్నమైన పరిశ్రమలు సజావుగా కొనసాగేందుకు వాతావరణం, సహకారమే కారణమన్నారు. కార్పొరేట్ సంస్థలు సామాజిక నిధిని విద్యావిభాగానికి కేటాయించాలన్నారు. తీరప్రాంత జిల్లాల్లోనూ పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలంగా ఉన్నాయన్నారు. కొత్త అధ్యక్షుడు వినీత్‌వర్మ మాట్లాడుతూ పారిశ్రామిక ప్రగతిని విస్తరింపచేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో కలసి అవసరమైన మౌలిక సదుపాయాలపై చర్చలు జరుపుతామన్నారు. బహ్లైర్ ఇండియా ప్రైవేట్‌లిమిటెడ్ ఇండియా అధ్యక్షుడు ప్రశాంత్‌బహ్లై బీసీఐసీ ఉపాధ్యక్షులుగా ఎంపికయ్యారు.

గ్రామీణ పిల్లలకు విద్యావకాశాలు పెంచాలి



నోటు పుస్తకాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

బంగారపేట, ఆగస్టు 3: అనేక గ్రామాలలో చదవాలని అభిలాష ఉన్నా సరైన సదుపాయాల కొరతలేని కారణంగా విద్యకు దూరమవుతున్నారని ఈ తరుణంలో గ్రామీణ పిల్లలకు విద్యావకాశాలు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని దళిత సమాజసేన రాష్ట్ర అధ్యక్షుడు సూలికుంటె ఆనంద్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రభుత్వ మాదిరి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎంతోమంది విద్యను పొందలేకపోతున్నారన్నారు. ప్రతిభావంతులైనవారి గుర్తించి సమాజంలోని ప్రధాన జనజీవన స్రవంతికి తేవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చేవారంతా పేదలేనని అయితే విద్యలో పేదలు కాదన్నారు. ఎంతోమంది ప్రభుత్వ పాఠశాలల్లో చదివినవారు ఉన్నత హోదాలకు చేరారన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు పుస్తకాలు ఇవ్వడం ప్రచారం కోసం కాదని పిల్లల్లో స్ఫూర్తి నింపేందుకేనన్నారు. ప్రతిభావంతులైన పిల్లలను గుర్తించి దాతలు సహకారం అందిస్తే ఎంతో ప్రయోజనకరమన్నారు. కర్ణాటక దళిత సమాజసేన పదాధికారులు గౌతమ్, దేవగానహళ్ళి నాగేశ్, అర్జున్ అయ్యప్ప, మంజునాథ్, సుబ్రమణి, టీచర్ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయరంగం మరింత బలోపేతం కావాలి

» గురువందనలో జీకేవీకే మాజీ వీసీ చెంగప్ప



ప్రొఫెసర్ శ్రీనివాసమూర్తిని సత్కరిస్తున్న హేమావతి తదితరులు

బెంగళూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయరంగం ఆధునిక సాంకేతిక విధానాలతో మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని గాంధీ కృషి విజ్ఞానకేంద్రం వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ వీసీ డాక్టర్ పీజీ చెంగప్ప అభిప్రాయపడ్డారు. 1995-99 బ్యాచ్ విద్యార్థులు ఇటీవల గురువందన కార్యక్రమం నిర్వహించారు. ప్రొఫెసర్‌లు గంగాధరప్ప, ఏపీ విశ్వనాథ్, సావిత్రమ్మ మోహన్‌రావ్‌లను సత్కరించారు. పూర్వ విద్యార్థులు వివిధ విభాగాలలో రాణిస్తున్నవారు పరిచయం చేసుకున్నారు. మాజీ ప్రొఫెసర్‌లు అబ్దుల్‌కలక్, సిద్ధరామయ్య, ముకుంద్, రాజణ్ణ, ప్రకాశ్ కమ్మరడి, గ్రేసీతోపాటు పలువురిని ఆత్మీయంగా సత్కరించుకున్నారు. 35వ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ నరేంద్ర రామ్, కార్యదర్శి ఏఎన్ లోకేశ్, ఉపాధ్యక్షుడు ఈరణ్ణ, కోశాధికారి గిరీశ్‌తోపాటు సభ్యులు హాలిరాజ్, భైరేగౌడ, హేమావతి, అన్నపూర్ణ, మంజుళ తదితరులు పాల్గొన్నారు.

అవేక్షలో వెరికోస్‌వెయిన్‌కు ప్రత్యేక విభాగం



ప్రత్యేక విభాగం ప్రారంభంలో ప్రముఖులు

బెంగళూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): వెరికోస్‌వెయిన్‌కోసం ప్రత్యేక చికిత్సలు అందించేందుకు అవేక్ష ఆసుపత్రిలో ప్రత్యేక విభాగాన్ని ఆరంభించారు. స్విజ్‌టన్ మెడికేర్ ఛైర్మన్ తహసీన్ నెడువంచేరి, ఇంటర్‌వెన్షన్ రేడియాలజిస్ట్ రాహుల్‌దేవ్, స్విజ్‌టన్ సీఈఓ శరత్ నాయర్, అవేక్ష డైరెక్టర్ ఆరతి బల్లాల్, ఉజ్వల బల్లాల్, ఆదిత్య బల్లాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీన్ మాట్లాడుతూ వెయిన్‌క్లినిక్ ప్రాథమికంగా కటింగ్ ఎడ్జ్ ట్రీట్‌మెంట్ విధానాన్ని పాటించడం ద్వారా సులభంగా నయం చేయవచ్చునన్నారు. వెరికోస్ నొప్పులతో బాధపడేవారికోసం తగిన చికిత్సలు, సలహాలు అందించాలనే ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశామన్నారు. ఉదయ్‌బల్లాల్ మాట్లాడుతూ నాణ్యమైన వైద్యం, అనుభవజ్ఞులైన వైద్యులు మా ప్రత్యేకత అన్నారు.

పిల్లల విద్యపట్ల శ్రద్ధ వహించాలి



ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థుల పేరెంట్స్ సమావేశంలో ఉపాధ్యాయులు

బాగేపల్లి, ఆగస్టు 3: తల్లిదండ్రులు తమ పిల్లల విద్యపట్ల శ్రద్ధ వహించడం బాధ్యతగా ఉండాలని ప్రభుత్వ మాదిరి బాలుర ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని ప్రభుత్వ మాదిరి ప్రాథమిక పాఠశాలలో ఎల్‌కేజీ, యూకేజీ తరగతుల పిల్లల తల్లిదండ్రుల సమావేశం శనివారం జరిగింది. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు వెంకటరవణ మాట్లాడుత ఉపాధ్యాయుల పాత్ర ఎంతముఖ్యమో తల్లిదండ్రుల ప్రభావం కూడా అంతే ప్రధానమన్నారు. పాఠశాలలో గురువులు చెప్పిన పాఠాలపై పిల్లలను అడిగి తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు లేఖనాసామగ్రి పంపిణీ చేశారు. చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు బాల్యంనుంచే సరైన బాటలు వేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటరాయప్ప, మునిరాజు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ముగళూరు అధ్యక్షురాలిగా సంపంగమ్మ



నూతన అధ్యక్షురాలు, సభ్యులకు సన్మానం

దొమ్మసంద్ర, ఆగస్టు 3: ఆనేకల్ తాలూకా సర్జాపుర హోబళిలోని ముగళూరు గ్రామ పంచాయితీ అధ్యక్షురాలిగా సంపంగమ్మ రాజప్ప ఎన్నికయ్యారు. శుక్రవారం నిర్వహించిన ఎన్నికల్లో బీజేపీ మద్దతుదారురాలు సంపంగమ్మ రాజప్ప, కాంగ్రెస్ మద్దతుదారులు ముని యమ్మ గంగప్ప నామినేషన్‌లు దాఖలు చేశారు. 14 ఓట్లు రావడంతో సంపంగమ్మ రాజప్ప అధ్యక్షుడిగా గెలుపొందారు. 9 ఓట్లు పొందిన మునియమ్మ గంగప్ప ఓటమి చెందారు. నూతన అధ్యక్షురాలు సంపంగమ్మ మాట్లాడుతూ ముగళూరు పంచాయతీని మరింత అభి వృద్ధి చేస్తానన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ సభ్యులు దొడ్డ తిమ్మసంద్ర అశోక్, వెంకటేశ్, తిండ్లు చలువరాజు, గౌరమ్మ, సుబ్రమణి, సుదీప్, లక్ష్మీ నాగరాజు, యల్లమ్మ, గోపి, యశోదమ్మ, వరలక్ష్మీ, నిర్మల తదితరులు పాల్గొని నూతన అధ్యక్షులను అభినందించారు.

ఫార్మా స్టార్టప్‌లో పలువురికి అవార్డులు



అవార్డులతో గ్రహీతలు, ప్రముఖులు

బెంగళూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): హెల్త్‌కేర్ ఫార్మాస్టార్టప్ కేటగిరీలో నాస్కామ్ ఆల్ గేమ్ చేంజర్స్ 2023-24లో వివిధ కేటగిరీలలో అవార్డులను ప్రదానం చేసింది. నగరంలో జరిగిన కార్యక్రమంలో నాస్కామ్ ఆల్ కన్‌ఫ్యూయెన్స్‌లో కో ఫౌండర్ హర్షవర్ధన్, విజ్జి సీఈఓ డాక్టర్ విష్ణువర్ధన్‌కు ప్రతిష్టాత్మక పురస్కారాలు పొందారు. నాస్కామ్ హెడ్ అంకిత్‌బోస్, ప్రోగ్రామ్ డైరెక్టర్ మాధవ్‌బిస్సాలు అందజేశారు. హెల్త్‌కేర్ టెక్నాలజీలో అద్భుతమైన విజయాలు సాధించినందుకు అవార్డులు ప్రదానం చేశారు.

పేకాట స్థావరంపై దాడులు

● 15 మంది అరెస్టు.. రూ.17 లక్షలు స్వాధీనం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ బాజీజాన్ సైదా

పెనుకొండ రూరల్, ఆగస్టు 3: కియ ఇండస్ట్రియల్ స్టేషన్ పోలీసులు పేకాట స్థావరాలపై శనివారం దాడులు నిర్వహించారు. మండల పరిధిలోని కొండంపల్లి, శెట్టిపల్లి గ్రామ శివార్లలో పేకాట ఆడుతున్న 15 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.17.10 లక్షల నగదు, 15 సెల్‌ఫోన్‌లు, 5 కార్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడినవారిలో బెంగళూరు, కర్నూలు జిల్లావాసులు ఉన్నారని పెనుకొండ డీఎస్పీ బాజీజాన్ సైదా తెలిపారు. నిర్వాహకుడు రవి పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలిస్తున్నామని తెలిపారు.

బెంగళూరులో 'అనంత'

ఎంపీ, ఎమ్మెల్యేలకు సన్మానం

అనంతపురం అర్బన్, ఆగస్టు 3: సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన అనంత ఉమ్మడి జిల్లాకు చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలను బెంగళూరుకు చెందిన టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. శనివారం బెంగళూరులోని ఓ ఫంక్షన్ హాల్‌లో హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, అనంత ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు, ఎంఎస్ రాజును సన్మానించారు. కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ అభిమానులు పాల్గొన్నారు.



సన్మాన సభకు హాజరైన ఎంపీ, ఎమ్మెల్యేలు

మానవ మనుగడకు మహాభారతం నిర్దేశం

» సామవేదం షణ్ముఖశర్మ



ప్రసంగిస్తున్న బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

బెంగళూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మహాభారతం మానవ మనుగడకు దిశానిర్దేశం చేసేలాంటి పవిత్ర గ్రంథమని డాక్టర్ బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ అభిప్రాయపడ్డారు. మారతహళ్ళిలోని న్యూహారిజన్ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ఏడురోజుల ప్రవచన యజ్ఞంకు నగర ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొంటున్నారు. శనివారం మూడోరోజు జరిగిన ప్రవచనంలో మానవాళి జీవనసాఫల్యం కొరకు వ్యాసమహర్షి మహాభారతంలో నిక్షిప్తపరిచిన ఘట్టాలను వివరించారు. ఈ నెల 7వరకు ప్రవచనం కొనసాగనుందని బెంగళూరు రుషి పీఠం సత్సంగం సభ్యులు తెలిపారు. వివరాలకు 80733 71132కు సంప్రదించాలని తెలిపారు.

గాయత్రిదేవికి విశేష పూజలు



అమ్మవారికి ప్రత్యేక అలంకరణ ఇలా..

శిడ్లఘట్ట, ఆగస్టు 3: పట్టణంలోని కెహెచ్‌పీ కాలనీలో గల శనేశ్వరస్వామి ఆలయంలో కొలువైన గాయత్రిదేవికి ఆషాఢ చివరి శుక్రవారం పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహిచారు. ఉదయం పంచామృతాభిషేకం, అలంకరణ, కుంకుమార్చన, మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఉదయం విశేషపూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయంలో మహాగణపతి, లక్ష్మీవెంకటేశ్వరస్వామిలు కూడా కొలువై ఉండడంతో భక్తులు తరలివచ్చారు.

యాదగిరి ఎస్ఐ అనుమానాస్పద మృతి



ఎస్సై పరశురామ్ (ఫైల్)

బెంగళూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): యాదగిరి పట్టణ సబ్ ఇన్‌స్పెక్టర్ పరశురామ్ అనుమానాస్పదంగా మృతి చెందారు. మానసిక ఒత్తిడికి గురై శుక్రవారం మధ్యాహ్నం పోలీస్‌క్వార్టర్స్‌లో నిద్రించిన వేళ మృతి చెందాడు. ముక్కు, నోట్లో రక్తస్రావం కావడం అనుమానాలకు కారణమవుతోంది. ఎమ్మెల్యే, అతడి కుమారుడి చర్యలతోన ఎస్సై మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. యాదగిరి పట్టణంలో ఎస్సైగా కొనసాగాలంటే రూ.30 లక్షలు ఇవ్వాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే చెన్నారెడ్డి పాటిల్, అతడి కుమారుడు పంపనగౌడలు డిమాండ్ చేశారని ఎస్సై భార్య ఫిర్యాదు చేశారు. కులం పేరుతోనూ దూషించారని ఫిర్యాదు చేసిన మేరకు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. కాగా దళిత సంఘాల ఆధ్వర్యంలో శనివారం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. దళితులపై ఎంతటిస్థాయిలో ఉన్నా వేధింపులు, దౌర్జన్యాలు తప్పడం లేదని విచారం వ్యక్తం చేశారు. ఎస్పీ సంగీతా జోక్యంతో నిరసన వీడారు. కాగా బెంగళూరులో హోం మంత్రి పరమేశ్వర్ మీడియాతో మాట్లాడుతూ ఎస్సై ఆత్మహత్య చేసుకోలేదని, డెత్‌నోట్ లేదన్నారు. బదిలీకి సంబంధించి మానసిక వేదనకు గురయ్యారని ఎస్సై భార్య ఫిర్యాదు చేశారన్నారు. సమగ్ర విచారణ జరుపుతున్నామన్నారు.

ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై హర్షం

శిడ్లఘట్ట, ఆగస్టు 3: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు సుప్రీంకోర్టు ఆమోదం తెలపడం హర్షణీయమని మాదిగదండోరా రాష్ట్ర కార్యదర్శి దేవరాజ్ అభి ప్రాయపడ్డారు. పట్టణంలోని ప్రభుత్వ అతిథిగృహంలో మీడియాతో మాట్లాడుతూ రిజర్వేషన్ వర్గీకరణకు సంబంధించి సుమారు 30 సంవత్సరాలపోరాటం జరిగిందని ఎట్టకేలకు సుప్రీంకోర్టు అంగీకరించడం సంతోషంగా ఉందన్నారు. పోరాటానికి నేతృత్వం వహించిన మంద కృష్ణ మాదిగకు ధన్యవాదాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పుతో విజయోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మీడియా సమావేశంలో అంజి హలసూరు, మంజునాథ్, సుగటూరు దేవరాజ్, రాష్ట్ర విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ప్రమోద్‌కుర్మా తదితరులు పాల్గొన్నారు.